సాక్షి పార్వతీపురం మన్యం

శుక్రవారం । 5 । మే । 2023



టీడీపీకి గుండెదడ

సిట్ (స్పెషన్ ఇన్వెస్టిగేషన్ టీమ్) విచారణ పూర్తయితే అలీబాబా ఎవరు? ఆయన వెనుక ఉన్న 40 దొంగలు ఎవరనేది బహిర్గతమవుతుందని ఉప ముఖ్యమంత్రి పీడిక రాజన్నదొర అన్నారు. - IIలో



చెస్ పోటీల్లో జిల్లాకు పతకాలు

రాష్ట్రస్థాయి చెస్ పోటీల్లో జిల్లాకు చెందిన క్రీడాకారులు ప్రతిభ కనబరిచారు. విజయనగరం వేదికగా ఈ నెల 1, 2 తేదీల్లో రాష్ట్ర స్థాయి చదరంగం పోటీలు ఫైర్ చెస్ స్కూల్ ఆధ్వర్యంలో నిర్వహించారు. - IIలో



శివాలయంలోకి ఏనుగులు

భామిని మండలంలోని పక్కుడుభద్ర సమీపంలో జీర్ణోద్ధరణ జరుగుతున్న స్వయం భూ దేవాలయంలోకి గురువారం ఆరు ఏనుగుల గుంపు ప్రవేశించి ప్రత్యేకత చాటుకుంది. - IIలో

గర్భిణుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ

ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణానికి చేపడుతున్న చర్యల్లో భాగంగా గర్భిణుల ఆరోగ్యానికి ప్రభుత్వం చాలా ప్రాధాన్యత ఇస్తోంది. గర్భం దాల్చిన నుంచి ప్రత్యేక వైద్య సేవలు అందించడం ద్వారా వారి ఆరోగ్యానికి భరోసా కల్పిస్తూనే బిడ్డ కూడా ఆరోగ్యకరంగా ఉండేలా పరీక్షిస్తూ అవరమైన మందులను పంపిణీ చేస్తోంది. అంతేకాకుండా హైరిస్క్ గర్భిణుల పట్ల ప్రత్యేక శ్రద్ధ కనబరుస్తోంది. తద్వారా తల్లీబిడ్డల ఆరోగ్యానికి భరోసా కల్పిస్తోంది.

- ప్రతి నెలా ప్రభుత్వ ఆస్పత్రుల్లో వైద్య పరీక్షలు
- ఫ్యామిలీ డాక్టర్‌తో అదనంగా ఇంటి వద్దే సేవలు
- జేఎస్‌వై ద్వారా రూ.వెయ్యి, పీఎంఎంవీవై ద్వారా మొదటి శిశువు కాన్పుకు రూ.5వేల అందజేత
- హైరిస్క్ గర్భిణుల కోసం అవసరమైన చర్యలు



మారుమూల గిరిజన గ్రామం కుసలో హైరిస్క్ గర్భిణికి ఆరోగ్యాన్ని పరీక్షిస్తున్న చేస్తున్న జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి డాక్టర్ టి.జగన్మోహనరావు

గుమ్మలక్ష్మీపురం: పార్వతీపురం మన్యం జిల్లాలో అధిక శాతం గిరిజన ప్రాంతం కావడం, అత్యధికంగా మారుమూల గ్రామాలు, గిరిశిఖర గ్రామాలు కావటం వలన గర్భిణుల ఆరోగ్యంపై వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది ప్రత్యేక శ్రద్ధ చూపుతోంది. గర్భిణిగా గుర్తింపైతే చాలు వైద్య సేవలను అందిస్తున్నారు. వారిలో హైరిస్క్ గర్భిణిలెవరైనా ఉంటే గుర్తించి మరింత మెరుగ్గా వైద్య సేవలను అందిస్తున్నారు. ఫలితంగా హైరిస్క్‌కు కారణమైన ప్రమాదకర పరిస్థితి నుంచి బయటపడి సుఖ ప్రసవం జరిగేలా చర్యలు చేపడుతున్నారు. తద్వారా బాలింత ఆరోగ్యం మెరుగుపడి శిశువు ఆరోగ్యంగా ఉండేందుకు దోహదపడుతున్నారు. పార్వతీపురం మన్యం జిల్లాలో 37 పీహెచ్‌సీలు, 5 యూపీహెచ్‌సీల పరిధిలో ప్రస్తుతం 15,927 మంది గర్భిణులుండగా, వీరిలో 2,968 మంది గర్భిణిలను హైరిస్క్ గర్భిణులుగా గుర్తించారు. అలాగే 1824 మంది బాలింతలున్నారు. గర్భిణిగా నమోదైనప్పటి నుండి ప్రసవం జరిగేంత వరకు క్రమం తప్పకుండా ఆరోగ్య పరీక్షలు ఆయా పీహెచ్‌సీల పరిధిలో నిర్వహిస్తున్నారు. గర్భిణుల ఆరోగ్య సంరక్షణే ధ్యేయంగా వైద్య ఆరోగ్య శాఖ పలు ఆరోగ్య కార్యక్రమాలను అమలు చేస్తోంది. ప్రతీ నెలా 9వ తేదీన ప్రధానమంత్రి సురక్షిత మాతృత్వ అభియాన్ (పీఎంఎస్‌ఎంఏ) కార్యక్రమం ద్వారా అన్ని ప్రభుత్వ ఆస్పత్రుల్లో గర్భిణులకు ఆరోగ్య పరీక్షలు, ఒకటి లేదా రెండు రోజుల ముందుగా గ్రామ సచివాలయాల పరిధిలో వెల్‌నెస్ సెంటర్లలో ఉచితంగానే పీఎంఎస్‌ఎంఏ ద్వారా ఆరోగ్య తనిఖీలు నిర్వహిస్తున్నారు. అంతేకాకుండా ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం ద్వారా గర్భిణులకు ఇళ్ల వద్దే ఆరోగ్య తనిఖీలు, కిల్కారీ సందేశం ద్వారా ఆరోగ్య సేవలు, ప్రభుత్వ ఆస్పత్రిలో ప్రసవమయ్యే వారికి డిశ్చార్జి అయ్యే వరకు ఉచిత ఆహారం, జేఎస్‌వై (జనని సురక్ష యోజన) పథకం ద్వారా రూ.1000 నగదు లబ్ధి అందే విధంగా, ప్రధానమంత్రి మాతృ వందన యోజన (పీఎంఎంవీవై) ద్వారా మొదటి శిశువు కాన్పుకు విడతల వారీగా రూ.5000 నగదును అందించడం, ఆరోగ్యశ్రీ పథకం ద్వారా సాధారణ, సిజేరియన్ కాన్పులు, రక్తహీనత నివారణకు ఐరన్ సుక్రోజ్ ఇంజెక్షన్లు, నెల వ్యవధిలో టీడీ టీకా రెండు డోసులు ఇస్తున్నారు. మారుమూల గ్రామాలు, గిరిశిఖర గ్రామాలు రవాణా సదుపాయం లేని ప్రాంతాలకు చెందిన గర్భిణులను ప్రసవ తేదీకి వారం రోజుల ముందుగానే అడ్మిట్ చేసేందుకు గుమ్మలక్ష్మీపురం, సాలూరులోని వైటీసీ కేంద్రాల్లో గిరిశిఖర గ్రామాల గర్భిణుల వసతి గృహాలను అందుబాటులోకి తెచ్చారు. గర్భిణులు ఆరోగ్య తనిఖీలకు వెళ్లేటప్పుడు, ప్రసవ సమయంలోనూ వైద్య సిబ్బంది వెంట ఉండడం, 108 రవాణా సౌకర్యం, డెలివరీ తర్వాత తల్లీబిడ్డను ఇంటికి క్షేమంగా చేర్చేందుకు 102 వాహన సదుపాయం, ఎప్పటికప్పుడు వైద్య సిబ్బంది గృహ సందర్శన ద్వారా ఆరోగ్య పర్యవేక్షణ చేయడం తదితర సేవలు నిర్వహిస్తున్నారు. గర్భిణులు, బాలింతలకు అంగన్‌వాడీ కేంద్రాల్లో పౌష్టికాహారం అందజేస్తున్నారు. ఐరన్ మాత్రలు క్రమం తప్పకుండా వేయిస్తున్నారు.

హైరిస్క్ గర్భిణుల పట్ల ప్రత్యేక శ్రద్ధ

రక్తహీనత, గత కాన్పులో అబార్షన్ కావడం, ఎక్కువ కాన్పులు, గర్భిణి ఎత్తు 145 సెంటీమీటర్ల కంటే తక్కువ ఉండటం, పిండం అసాధారణ స్థితి, మధుమేహం, గుండె జబ్బులు, గర్భస్థ సమయంలో రక్తపోటు (పీఐహెచ్), కవలలు, నెలల నిండక మునుపే నొప్పులు, ఉమ్మనీరు ఎక్కువగా ఉండటం వంటి లక్షణాలుండే గర్భిణిని హైరిస్క్ గర్భిణిగా ఎంపిక చేస్తారు. ఈ లక్షణాలతో గుర్తించి గర్భిణిని ఈ ప్రమాదకర పరిస్థితి నుంచి సురక్షితంగా బయటపడేందుకు అవసరమైన చర్యలు చేపట్టడం, ప్రత్యేక వైద్యుడిచే వైద్య సేవలు అందించడం జరుగుతోంది. అంతే కాకుండా ప్రసవ తేదీకి వారం లేదా ఐదు రోజులు ముందుగానే సంబంధిత రిఫరల్ ఆస్పత్రి, వైటీసీ కేంద్రాలు, బర్త్ వెయిటింగ్ హోంలలో అడ్మిట్ చేస్తున్నారు. ఇందు కోసం ఉచిత రవాణా సౌకర్యం కూడా కల్పిస్తున్నారు. ఈ సేవలన్నీ గర్భిణులకు సక్రమంగా అందుతున్నాయో.. లేదో.. తెలుసుకునేందుకు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేస్తూ మాతృ మరణాలు నివారణకు కృషి చేస్తోంది.

మాతృ మరణాల నివారణకు కృషి



మాతృ మరణాల నివారణే లక్ష్యంగా గర్భిణులు, హైరిస్క్ గర్భిణులు, బాలింతల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్నాం. ప్రతీ గర్భిణికి నెలనెలా ఆస్పత్రులు, వెల్‌నెస్ సెంటర్ల వద్ద వైద్య సేవలతో పాటు అవసరమైన తనిఖీలు చేపట్టే ప్రక్రియ నిరిర్విరామంగా సాగుతోంది. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా బలవర్ధకమైన ఆహారాన్ని కూడా అందించడం జరుగుతోంది. ప్రసవ సమయం దగ్గర్లో ఉండే గర్భిణులు బర్త్ వెయిటింగ్ హోం/రిఫరల్ ఆస్పత్రులు/వైటీసీల్లోని గర్భిణుల వసతి గృహాల్లో చేరి సుఖ ప్రసవం పొందేందుకు తగిన చర్యలు చేపడుతున్నాం.

– డాక్టర్ టి.జగన్మోహనరావు, జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి (డీఐఓ), పార్వతీపురం మన్యం జిల్లా

న్యూస్‌రీల్

ఫస్ట్ మనమే కావాలి

- డీఆర్‌డీఏ పీడీ కిరణ్‌కుమార్



సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న డీఆర్‌డీఏ పీడీ కిరణ్‌కుమార్

పార్వతీపురం టౌన్: వెలుగు సంస్థ నిర్వహిస్తున్న అన్ని కార్యక్రమాల్లో పార్వతీపురం మన్యం జిల్లా మొదటి స్థానంలో ఉండాలని డీఆర్‌డీఏ పీడీ పెద్దింటి కిరణ్‌కుమార్ అన్నారు. స్థానిక డీఆర్‌డీఏ కార్యాలయంలో వెలుగు సిబ్బందితో గురువారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలను బీమా పథకంలో చేర్చాలని, అప్పులు మంజూరు చేసి వారికి జీవనోపాధి కల్పించాలన్నారు. బీమా నమోదు ప్రక్రియలో సిబ్బంది ఎటువంటి తప్పులు లేకుండా నమోదు చేయాలన్నారు. మహిళల ఆర్థికాభివృద్ధికి ప్రతీ మండలంలో మహిళా మార్టులు ఏర్పాటు చేయడానికి చర్యలు తీసుకోవడంతో పాటు మహిళలకు అవగాహన కల్పించాలని సూచించారు. శ్రీనిధి రుణాల పురోగతిపై ఆరా తీసి వాటి సంఖ్యను పెంచేలా చూడాలని సిబ్బందికి ఆదేశించారు. కార్యక్రమంలో ఏపీడీ వై.సత్యంనాయుడు, డీపీఎంలు, ఏపీఎంలు, వెలుగు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ సంక్షేమ క్యాలెండర్ ఆవిష్కరణ



సంక్షేమ క్యాలెండర్‌ను ఆవిష్కరించిన కలెక్టర్ నిషాంత్‌కుమార్ ఇతర అధికారులు

పార్వతీపురం: ప్రభుత్వ సంక్షేమ క్యాలెండర్‌ను కలెక్టర్ నిషాంత్‌కుమార్ ఆవిష్కరించారు. 2023 – 24 సంవత్సరానికి అమలు చేయనున్న సంక్షేమ పథకాల వివరాలతో ముద్రించిన జగనన్న ప్రభుత్వ సంక్షేమ క్యాలెండర్‌ను తన కార్యాలయంలో గురువారం విడుదల చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం సంక్షేమ పథకాల క్యాలెండర్ ప్రకటించి షెడ్యూల్ ప్రకారం అమలు చేస్తుందన్నారు. కార్యక్రమంలో జేసీ సి.విష్ణుచరణ్, డీఆర్‌ఓ జె.వెంకటరావు, డీఆర్‌డీఏ పీడీ పి.కిరణ్‌కుమార్, పీఆర్ ఇంజినీరింగ్ అధికారి కృష్ణాజీ, ఆర్‌డబ్ల్యూఎస్ ఇంజినీరింగ్ అధికారి ప్రభాకరరావు హౌసింగ్ పీడీ రఘురాం, డ్వామా పీడీ కె.రామచంద్రరావు, జిల్లా వ్యవసాయాధికారి రాబర్ట్ పాల్ తదితరులు పాల్గొన్నారు.

గంజాయి రవాణాపై కఠినంగా వ్యవహరిస్తాం

- ఎస్పీ విక్రాంత్ పాటిల్



ఎస్పీ విక్రాంత్ పాటిల్

పార్వతీపురం టౌన్: జిల్లాలో గంజాయి రవాణా, అమ్మకాలపై అడ్డుకట్ట వేసేందుకు విస్తృతంగా తనిఖీలు నిర్వహిస్తున్నామని ఎస్పీ విక్రాంత్ పాటిల్ అన్నారు. జిల్లా పోలీసు కార్యాలయంలో విలేకరులతో గురువారం ఆయన మాట్లాడారు. జిల్లా సరిహద్దు గ్రామాల్లో, మారుమూల ప్రాంతాల్లో, ముఖ్యమైన ప్రదేశాల్లో తనిఖీలు నిర్వహించాలని పోలీసు అధికారులకు సూచించామన్నారు. గంజాయి అక్రమ రవాణా, విక్రయాలను పూర్తి స్థాయిలో అరికట్టడానికి తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. గంజాయి విక్రయించేవారు ఎక్కువగా శ్రామికులను, యువతను లక్ష్యంగా చేసుకొని విక్రయిస్తుంటారన్నారు. గతంలో గంజాయి విక్రయించిన ప్రాంతాలపైన, వ్యక్తులపైన నిఘా పెట్టామన్నారు. యువత మీద గంజాయి చెడు ప్రభావం ఎక్కువగా పడుతుందని, దీనివల్ల వారి భవిష్యత్ నాశనం అవుతుందన్నారు. గంజాయి, సంబంధిత కేసుల్లో ఎవరైనా పట్టుబడితే పూర్తి స్థాయిలో విచారించి గంజాయి సరఫరా ఎక్కడ నుండి వస్తుందో చివరిగా ఎవరు వినియోగిస్తున్నారో వారి పూర్తి వివరాలను తెలుసుకుంటామన్నారు. వారందరినీ అదుపులోకి తీసుకొని కఠినమైన శిక్షలు పడేలా కేసులు నమోదు చేస్తామన్నారు. గంజాయి విక్రయాలను సమూలంగా అరికట్టాలని పోలీసు అధికారులను ఆదేశించారు. గంజాయి రవాణా, విక్రయాలపై ఎటువంటి సమాచారం ఉన్నా ప్రజలు పోలీసు సిబ్బందికి తెలియజేయాలని కోరారు. తెలిపిన వారి వివరాలను గోప్యంగా ఉంచుతామని ఎస్పీ చెప్పారు.

పార్వతీపురానికి బైపాస్ రోడ్డు మంజూరు చేయాలి



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ నిషాంత్ కుమార్

పార్వతీపురం: పార్వతీపురం పట్టణానికి బైపాస్ రోడ్డును మంజూరు చేయాలని కలెక్టర్ నిషాంత్‌కుమార్ కోరారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డా.కెఎస్.జవహర్‌రెడ్డి కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్‌ను గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా రీసర్వే, జాతీయ రహదారులకు భూసేకరణ, వ్యవసాయం, ఉద్యానవనాలు, గృహనిర్మాణం, పంచాయతీరాజ్ శాఖల ప్రగతిని సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పార్వతీపురం మన్యం జిల్లా ప్రధాన కేంద్రానికి బైపాస్, జాతీయ రహదారితో అనుసంధానించాలన్నారు. పట్టణం గుండా ఒడిశా రాష్ట్రం రాయఘడ ఇతర ప్రాంతాలకు భారీ వాహనాలు వెళ్తున్నాయని, తద్వారా రద్దీ ఎక్కువగా వుందని వివరించారు. వంద కిలోమీటర్ల నిడివి గల చిలకపాలెం(ఎన్‌హెచ్–16), రామభద్రపురం(ఎన్‌హెచ్ 26), పార్వతీపురం – రాయఘడ(ఎన్‌హెచ్ 326), ఆమదాలవలస, పాలకొండ, వీరఘట్టం, కూనేరు మీదుగా రాయఘడను కలిపే 145 కిలోమీటర్ల కళింగపట్నం – శ్రీకాకుళం – పార్వతీపురం(సీఎస్‌పీ రోడ్) రహదారి పార్వతీపురం గుండా వెళ్తుందన్నారు. వీటిని అభివృద్ధి చేయడం ద్వారా జిల్లా ప్రధాన కేంద్రానికి మెరుగైన అనుసంధానం జరిగి ఈ ప్రాంత అభివృద్ధికి దోహదం చేస్తుందన్నారు. జిల్లా గుండా వెళ్తున్న విశాఖ – రాయపూర్ గ్రీన్‌ఫీల్డ్ జాతీయ రహదారిని కలుపుతూ జాతీయ రహదారి –16తో అనుసంధానం చేసి రాస్ట్ కోస్టు కారిడార్‌గా ఏర్పాటు చేయాలన్నారు. ఈ మేరకు అన్నింటికి ప్రతిపాదనలు సమర్పించామన్నారు. వీటిపై చర్యలు చేపట్టాలని రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జాతీయ రహదారుల చీఫ్ ఇంజినీర్‌ను ఆదేశించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో ఏసీ సి.విష్ణుచరణ్, డీఆర్‌ఓ జె.వెంకటరావు, డీఆర్‌డీఏ పీడీ పి.కిరణ్‌కుమార్, పీఆర్ ఇంజినీరింగ్ అధికారి ఎంవీ కృష్ణాజీ, ఆర్‌డబ్ల్యూఎస్ ఇంజినీరింగ్ అధికారి ప్రభాకరరావు, హౌసింగ్ పీడీ రఘురాం తదితరులు పాల్గొన్నారు.

ఆగమోక్తంగా శ్రీవారి ఆలయ మహాసంప్రోక్షణ



కలశాలతో శ్రీవారి ఆలయంలోకి వెళ్తున్న టీటీడీ చైర్మన్ వైవీసుబ్బారెడ్డి దంపతులు

- ఘనంగా యాగశాలలో మహా పూర్ణాహుతి
- పూజల్లో పాల్గొన్న టీటీడీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి దంపతులు
- వైభవంగా శ్రీనివాసుని కల్యాణం



శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న టీటీడీ చైర్మన్ సుబ్బారెడ్డి



శ్రీవారి కల్యాణం నిర్వహిస్తున్న వేదపండితులు

సీతంపేట: సీతంపేటలో నూతనంగా నిర్మించిన శ్రీవేంకటేశ్వర స్వామి వారి ఆలయ మహా సంప్రోక్షణ గురువారం ఘనంగా జరిపారు. తిరుమల తిరుపతి దేవస్థానం చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి దంపతులు హాజరై ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. యాగశాలలో మహా పూర్ణాహుతి జరిపారు. అనంతరం కుంభ ప్రదక్షిణ చేశారు. వృషభ లగ్నంలో మహా సంప్రోక్షణ కళావాహన చేపట్టారు. ఈ క్రతువుల ద్వారా యాగశాలలోని కలశాలలో ఇమిడి ఉన్న దేవతా శక్తిని శ్రీవేంకటేశ్వరస్వామి, శ్రీపద్మావతి అమ్మవారు, శ్రీగోదాదేవి, గరుడాళ్వార్, ద్వారపాలకుల విగ్రహాల్లోకి ఆవాహన చేశారు. అనంతరం అక్షతారోపణ, బ్రహ్మఘోష, ఆచార్య బహుమానం అందించారు. ఉదయం 10 గంటలకు భక్తులకు స్వామివారి దర్శనం ప్రారంభమైంది. సీతంపేట పరిసర ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు విచ్చేసి స్వామివారిని దర్శించుకున్నారు. అన్నప్రసాదాలు భక్తులకు అందజేశారు. సాయంత్రం శ్రీవారి కల్యాణం ఘనంగా నిర్వహించారు. ఆరు రోజుల పాటు నిర్వహించిన కార్యక్రమాల్లో శ్రీవారి సేవకులు విశేష సేవలు అందించారు. భక్తులకు తాగునీరు, అన్నప్రసాదాల పంపిణీ, ఆలయానికి అవసరమైన పూలు కట్టడం తదితర సేవలు అందించారు. టీటీడీ ధార్మిక ప్రాజెక్టుల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పలు సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా కోలాటం, భరతనాట్య ప్రదర్శన, ఇతర భజనలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ఎంపీ బెల్లాన చంద్రశేఖర్, ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్, టీటీడీ జేఈఓ వీరబ్రహ్మం, ఎమ్మెల్యేలు విశ్వాసరాయి కళావతి, పాముల పుష్పశ్రీవాణి, రెడ్డి శాంతి, కంబాల జోగులు, శంబంగి చిన్నఅప్పలనాయుడు, టీటీడీ బోర్డు సభ్యులు మల్లాది కృష్ణారావు, జీసీసీ ఎండీ సురేష్‌కుమార్, ఐటీడీఏ పీఓ కల్పనాకుమారి, ఆగమ సలహాదారు మోహనరంగాచార్యులు, చీఫ్ ఇంజినీర్ నాగేశ్వరరావు, ఎస్‌ఈ సత్యనారాయణ, వీజీఓ మనోహర్, ఎంపీపీ బి.ఆదినారాయణ, వైస్ ఎంపీపీ కె.సరస్వతి, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు తదితరులు పాల్గొన్నారు.

అందమైన హరివిల్లు



వీరఘట్టం మండలం కడకెల్ల సమీపంలో ఆకాశంలో గురువారం సాయంత్రం ఏర్పడిన హరివిల్లు చూపరులకు కనువిందు చేసింది. ఓ వైపు తేలికపాటి వర్షం కురుస్తుండగా ఆకాశంలో సప్తవర్ణాలతో ఇంద్రధనస్సు కనిపించడంతో యువత తమ సెల్‌ఫోన్లలో దీన్ని బంధించారు. ఆకాశంలో సప్త వర్ణాలు.. నేలపై పచ్చని పంట పొలాలు మొత్తంగా ఆకట్టుకున్నాయి.

- వీరఘట్టం

వ్యవసాయ రంగంలో కొత్త విప్లవం

రైతు సంక్షేమమే లక్ష్యంగా పని చేస్తున్న రాష్ట్రంలోని జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వం వారికి వ్యవసాయ సీజన్‌లో ఎటువంటి ఇబ్బందులు లేకుండా అన్ని చర్యలూ తీసుకుంది. విత్తనం నుంచి పంట దిగుబడి విక్రయం వరకు అన్నీ తానై చూసేందుకు వీలుగా ఆర్‌బీకేలను ఏర్పాటు చేసింది. ఇందులో ఇంటర్ బైపీసీ చదివిన వారిని వలంటీర్లుగా నియమించి రైతుకు సేవలు అందించడం ద్వారా అండగా నిలుస్తోంది.



కురుపాంలోని రైతు భరోసా కేంద్రం

- రైతులకు వలంటీర్ల సేవలు
- అన్నదాతకు అండగా వలంటీర్లు
- వీరి నియామకంతో ఆర్‌బీకేలు బలోపేతం
- జిల్లాలో 306 ఆర్‌బీకేల్లో వలంటీర్లు

పార్వతీపురం టౌన్: విత్తనం నుంచి విక్రయం వరకు వ్యవసాయానికి సంబంధించి రైతు భరోసా కేంద్రాలు అన్ని రకాల సేవలను అందిస్తూ భేష్ అనిపించుకుంటున్నాయి. అన్నదాతకు చేదోడు వాదోడుగా నిలుస్తున్నాయి. ఆర్బీకేల నిర్వహణ విషయంలో ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటోంది. రైతుకు ఏ కష్టం వచ్చినా ఈ కేంద్రాలు భరోసా ఇవ్వగలగాలనే సంకల్పాన్ని ఆచరణ సాధ్యం చేస్తోంది. ప్రతి ఆర్బీకేకు ఒక వలంటీర్‌ను నియమించింది. రైతులకు మరిన్ని సేవలు అందించేందుకు వీలుగా చర్యలు చేపట్టింది. ప్రస్తుతం వీటిలో గ్రామ వ్యవసాయ సహాయకులు, గ్రామ ఉద్యాన సహాయకులు, గ్రామ సెరికల్చర్ సహాయకులు పని చేస్తున్నారు. వీరినే ఆర్బీకే ఇన్‌చార్జిలుగా వ్యవహరిస్తున్నారు. వీరు ఎక్కువ సమయం క్షేత్ర స్థాయిలో ఉండాల్సి వస్తోంది. అందుకు రైతు భరోసా కేంద్రంలో రైతులకు సేవలందించేందుకు ఇంటర్మీడియెట్ బైపీసీ చేసిన వలంటీర్లను నియమించారు.

రైతు సమస్యలకు శాశ్వత పరిష్కారం

గ్రామ స్థాయిలో ఆర్‌బీకేలు ఏర్పాటుతో రైతులు ఎదుర్కొనే అనేక సమస్యలకు శాశ్వత పరిష్కారం లభించింది. విత్తన ఎంపిక నుంచి పంట విక్రయం వరకు అన్ని రకాల సేవలు ఆర్బీకేల్లో లభ్యమవుతున్నాయి. దీంతో ఇవి దేశానికే రోల్ మోడల్‌గా నిలిచాయి. వలంటీర్లు ఆర్బీకేల్లో రైతులకు సేవలు అందించడంతో మరో విప్లవాత్మక మార్పుకు అవకాశం ఏర్పడింది. గతంలో ప్రైవేటు డీలర్లు రసాయ ఎరువులను అడ్డగోలుగా అధిక ధరలకు విక్రయించేవారు. ఎమ్మార్పీపై రూ.50 నుంచి రూ.100 వరకు ఎక్కువ వసూలు చేసేవారు. ఆర్బీకేల ఏర్పాటుతో ప్రైవేటు డీలర్ల అక్రమాలు చాలా వరకు అదుపులోకి వచ్చాయి. రబీ సీజన్‌కు సంబంధించి అవసరమైనన్ని ఎరువులు సిద్ధం చేశారు. ఆర్బీకేల ద్వారా సబ్సిడీపై విత్తనాలు పంపిణీ చేస్తున్నారు. అన్ని రకాల పురుగు మందులను కూడా నిర్దిష్టమైన ధరలకు విక్రయిస్తున్నారు.

చేరువైన సేవలు

జిల్లాలో 306 రైతు భరోసా కేంద్రాలున్నాయి. ప్రతి ఆర్బీకేకు ఇంటర్ చదివిన వలంటీర్ నియమితులయ్యారు. ఇది వరకే ప్రతి 50 ఇళ్లకు ఒక వలంటీరును నియమించిన సంగతి తెలిసిందే. వీరి ద్వారా ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్తున్నారు. వీరిలోనే ఇంటర్ (బయాలజీ) చదివిన వారిని గత ఖరీఫ్ సమయంలో ఆర్బీకే వలంటీర్లుగా నియమించారు. వలంటీర్లకు ఆర్బీకేల నిర్వహణపై శిక్షణ ఇచ్చారు. విత్తనాల పంపిణీ, డిజిటల్ కియోస్క్ ద్వారా ఎరువులు, విత్తనాలు, పురుగు మందులకు ఆర్డర్ పెట్టడం, పంపిణీ చేయడం వంటి అన్ని కార్యక్రమాలు ఆర్బీకే ఇన్‌చార్జిల పర్యవేక్షణలో వీరు చేపడుతున్నారు. వలంటీర్ల నియామకంతో రైతులకు ఆర్బీకేల సేవలు బాగా చేరువయ్యాయి.

నిరంతం సేవలు

ఆర్బీకేలలో ముఖ్య భూమిక పోషిస్తున్న ముగ్గురు ఉద్యోగులూ ప్రధానంగా ఈ–క్రాప్ బుకింగ్ ప్రక్రియ కోసం ఎక్కువ సమయాన్ని పొలాల్లో వెచ్చించాల్సి వస్తోంది. వారంలో ఒక రోజు పొలంబడి కార్యక్రమం నిర్వహిస్తున్నారు. మండల సబ్ డివిజన్, జిల్లా స్థాయిలో నిర్వహించే సమావేశాలు, శిక్షణ కార్యక్రమాలకు హాజరు కావాలి. ఇటువంటి సమయాల్లో ఇన్‌చార్జిలు బయటకు వెళ్తే ఆర్బీకేల్లో ఇబ్బందులు తలెత్తుతాయి. అత్యవసర సమయాల్లో కొందరు రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ సమస్య ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి వెళ్లింది. వెంటనే ఆయన స్పందించారు. సమస్య పరిష్కారంగా వలంటీర్ల నియామకానికి ఆదేశాలు జారీ చేశారు. దీంతో నిరంతరం సేవలు అందే అవకాశం ఏర్పడింది. దీనిపై రైతుల నుంచి హర్షాతిరేకాలు వ్యక్తం అవుతున్నాయి.

అన్నదాతకు అండగా...



రైతు భరోసా కేంద్రాల ద్వారా రైతులకు అందుతున్న సేవలు అద్భుతం. రైతుకు ఎటువంటి ఇబ్బంది లేకుండా అన్ని రకాల సేవలు అందుతున్నాయి. వీఏఏలు క్షేత్ర స్థాయిలో ఉన్నప్పుడు కొంతమేర ఇబ్బందులు పడకుండా ప్రభుత్వం వలంటీర్లను నియమించింది. ఈ విధానం దేశంలో ఎక్కడా లేదు. ఆర్బీకేలు ఏర్పాటు, సిబ్బంది నియామకంతో రైతులకు సేవలు అందిస్తున్నాం

– రాబర్ట్‌పాల్, జిల్లా వ్యవసాయాధికారి, పార్వతీపురం మన్యం

జిల్లాలో మండలాల వారీ ఆర్‌బీకే వివరాలు

మండలం	ఆర్‌బీకేలు
పార్వతీపురం	21
సీతానగరం	20
బలిజిపేట	19
సాలూరు	22
పాచిపెంట	17
మక్కువ	16
గుమ్మలక్ష్మీపురం	23
కురుపాం	20
గరుగుబిల్లి	13
జియ్యమ్మవలస	25
కొమరాడ	17
భామిని	16
పాలకొండ	24
వీరఘట్టం	24
సీతంపేట	29

క్లుప్తంగా

ఆటో డ్రైవర్‌కు ఏడాది జైలు శిక్ష

తెర్లాం: నిర్లక్ష్యంగా ఆటో నడిపి ఓ వ్యక్తి మృతి చెందడానికి, ఇద్దరు వ్యక్తులు గాయపడడానికి కారణమైన ముద్దాయి ఆటోడ్రైవర్‌కు ఏడాది జైలు శిక్షతోపాటు, రూ.2,500లు అపరాధ రుసుమును బొబ్బిలి పీజేసీజే కమ్ జేఎఫ్‌సీఎం కోర్టు మేజిస్ట్రేట్ సరోజినమ్మ విధించారు. దీనికి సంబంధించి తెర్లాం ఎస్సై ఆర్.రమేష్ గురువారం తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మండలంలోని జన్నివలస గ్రామానికి చెందిన నాగళ్ల అప్పలనాయుడు 2020 డిసెంబర్ 7న ఆటోలో ప్రయాణికులను ఎక్కించుకుని రాజాం వెళ్తున్నాడు. పెరుమాళి దాటిన తరువాత శ్రీసత్యసాయి స్కూల్ ఎదురుగా రోడ్డు పక్కనే ఉన్న విద్యుత్ స్తంభాన్ని ఆటో ఢీకొంది. ఈ ప్రమాదంలో ఆటోలో ప్రయాణిస్తున్న నెమలాం గ్రామానికి చెందిన కోనారి నరసింహులు మృతి చెందగా, మరో ఇద్దరు వ్యక్తులకు గాయాలయ్యాయి. అప్పట్లో ఆటో డ్రైవర్‌పై పోలీసులు కేసు నమోదు చేసి అరెస్ట్ చేశారు. తదుపరి చర్యల నిమిత్తం ఈ కేసును బొబ్బిలి కోర్టుకు అప్పగించారు. ఈ కేసుకు సంబంధించి తీర్పు వెలువడింది.

మళ్లీ పులి ఆందోళన

శృంగవరపుకోట: మండలంలో మళ్లీ పులి పాదముద్రలు కనిపిస్తున్నాయంటూ రైతులు భయాందోళన చెందుతున్నారు. పెదఖండేపల్లి గ్రామంలో డాక్టర్ సతీష్‌రాజు పొలం వద్ద గొంప అప్పారావు కళ్లం వద్ద పులి పాదముద్రలు గుర్తించామని ఒక్కో పాదముద్ర 8అంగుళాల పరిమాణంలో ఉందని స్థానికులు చెప్పారు. పాదముద్రలను బట్టి పులిగా అనుమానిస్తున్నామని, గతంలో ఇదే ప్రాంతంలో పులి దాడి చేసి ఒక ఆవు పెయ్యిని సమీపంలోని మెట్టపైకి ఈడ్చుకుపోయిందని గుర్తు చేశారు. కొందరు మాత్రం కొత్తూరు - మల్లిపూడి రహదారిలో పులి పాదముద్రలు చూశామని చెబుతున్నారు. దీంతో పులి ఎస్.కోటకు ఉత్తరవైపున ఉన్న పెదఖండేపల్లి వైపు తిరుగుతోందా? దక్షిణ దిక్కున ఉన్న మల్లిపూడి వైపు మసలుతోందో తెలియక ఆందోళన చెందుతున్నారు. రెండు ప్రాంతాల్లో రెండు పులులు ఉన్నాయా? అన్న సందేహం వ్యక్తం చేస్తున్నారు. పులి జాడలు కనిపిస్తున్నందున పశువుల కాపరులు, మేకలు, గొర్రెల మందల వెంట వెళ్లే కాపరులు ఒక్కొక్కరుగా పోవద్దని అటవీశాఖ అధికారులు కోరుతున్నారు.

ఆధ్యాత్మికతతోనే ఆరోగ్యవంతమైన సమాజం

పూసపాటిరేగ: ఆధ్యాత్మికతతోనే ఆరోగ్యవంతమైన సమాజం ఏర్పడుతుందని ఆధ్యాత్మిక వేత్త బి.రమేష్‌కుమార్ అన్నారు. గురువారం స్థానిక షిర్డీసాయి ఆలయం ప్రాంగణంలో విద్యార్థులకు ఆధ్యాత్మిక పాఠాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, వారం రోజుల పాటు వేదాలు, రామాయణ, మహాభారతంపై విద్యార్థులకు అవగాహన తరగతులు నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు గంపా ఉషా, బూరాడ సుశీల, బాలాజీ మాష్టారు, తదితరులు పాల్గొన్నారు.

'సుప్రీం' ఉత్తర్వులతో టీడీపీకి గుండెదడ

● ఉపముఖ్యమంత్రి పీడిక రాజన్నదొర


సమావేశంలో మాట్లాడుతున్న ఉపముఖ్యమంత్రి పీడిక రాజన్నదొర

సాలూరు: సిట్ (స్పెషల్ ఇన్వెస్టిగేషన్ టీమ్) విచారణ పూర్తయితే ఆలీబాబా ఎవరు? ఆయన వెనుక ఉన్న 40 దొంగలు ఎవరనేది త్వరలోనే బహిర్గతమవుతుందని, ఈ క్రమంలో టీడీపీ నాయకులకు గుండెదడ మొదలైందని ఉపముఖ్యమంత్రి, గిరిజనసంక్షేమ శాఖామంత్రి పీడిక రాజన్నదొర అన్నారు. సాలూరు పట్టణంలోని సీతారామ కల్యాణ మంటపంలో గురువారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడారు. వారి హయాంలో జరిగిన అవినీతి, అక్రమాలు బహిర్గతమవుతాయనే భయంతో సిట్ విచారణను అడ్డుకోవడానికి టీడీపీ నాయకులు హైకోర్టు నుంచి స్టే తెచ్చుకున్నారని ఆరోపించారు. ఏ తప్పు చేయలేదని బీరాలు పలికే టీడీపీ నాయకులు స్టే ఎందుకు తెచ్చుకున్నారని ప్రశ్నించారు. టీడీపీ హయాంలో జరిగిన అవినీతి భాగోతాలపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక బృందం (సిట్) ద్వారా విచారించవచ్చని తాజాగా సుప్రీంకోర్టు పచ్చజెండా ఇచ్చిందన్నారు. దీంతో టీడీపీ నాయకులు బెంబేలెత్తున్నారన్నారు. సిట్ విచారణ పూర్తయితే టీడీపీ అవినీతి భాగోతాలు బయటకు వస్తాయని ఆ భయంతోనే ముఖ్యమంత్రి వైఎస్‌జగన్‌మోహన్‌రెడ్డిపై తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని మండిపడ్డారు. ఫైబర్‌నెట్‌లో సుమారు రూ.250 కోట్లు, స్కిల్ డెవలప్‌మెంట్‌లో సుమారు రూ.350 కోట్ల అవినీతి జరిగిందని ఆరోపించారు. ఈ అవినీతిపై అసెంబ్లీలో తాను మాట్లాడానని, స్క్రీనింగ్ వేశామని గుర్తుచేశారు. టీడీపీ అవినీతి, అక్రమాలపై సిట్ విచారణకు సుప్రీం కోర్టు పచ్చ జెండా ఊపిన నేపథ్యంలో ఇకనైనా జనసేన నాయకుడు పవన్‌కల్యాణ్ మారుతారో లేదో వేచి చూడాలన్నారు. జనసేన నాయకులు, కార్యకర్తలు టీడీపీ జెండాలు మోయవద్దని హితవు పలికారు.

రాష్ట్రస్థాయి చెస్ పోటీల్లో జిల్లాకు పతకాలు


రాష్ట్రస్థాయి చెస్ పోటీల్లో విజేతలుగా నిలిచిన జిల్లా క్రీడాకారులు

విజయనగరం: రాష్ట్రస్థాయిలో జరిగిన చెస్ పోటీల్లో జిల్లాకు చెందిన క్రీడాకారులు ప్రతిభ కనబరిచారు. విజయనగరం వేదికగా ఈనెల 1, 2 తేదీల్లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర స్థాయి చదరంగం పోటీల్లో ఫైర్ చెస్ స్కూల్ ఆధ్వర్యంలో పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో వివిధ కేటగిరిల్లో 14 మంది క్రీడాకారులకు బహుమతులు వచ్చాయి. ఓపెన్ కేటగిరిలో కె.ప్రహ్లాద్, కె. సోమనాథ్ (కేంద్రియ విద్యాలయం) సత్యసాగర్ నాయుడు, ఎం.జయ శ్రీ (పీఎస్ఆర్ స్కూల్), కె.దివీస్, జి.కాశిష్ (సస్ స్కూల్), ఎస్.జోషిత్, కె.కీర్తి (నారాయణ స్కూల్) షేక్ షకీల్ (నవోదయ) బి.అభయ్ సాయి (ఢిల్లీ పబ్లిక్ స్కూల్) ఎన్.ప్రియాంక, ఎం సుహాష్ (శ్రీ చైతన్య స్కూల్) రిజ్వాన్ (ఫోర్ట్ సిటీ) కె.రిషి (మై లైఫ్ స్కూల్)లు బహుమతులు పొందారు. క్రీడాకారులకు జిల్లా చెస్ అసోసియేషన్ కార్యదర్శి కేవీ జ్వాలాముఖి, కోచ్ అభినందనలు తెలియజేశారు.

సాక్షి ఆధ్వర్యంలో..చిన్నారులకు చిత్రలేఖనం పోటీలు

● జూనియర్ , సీనియర్ విభాగాల్లో ఎంపికలు
● హాజరైన ప్రతి ఒక్కరికీ మెరిట్ సర్టిఫికెట్

విజయనగరం టౌన్: సాక్షి ఆధ్వర్యంలో లిఫ్టింగ్ హ్యాండ్స్ సేవా సంఘం, సత్యా విద్యాసంస్థల సౌజన్యంతో చిన్నారులకు చిత్రలేఖనం పోటీలు ఈ నెల 9 న నిర్వహించనున్నట్లు సత్య డిగ్రీ, పీజీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎంవీ.సాయిదేవమణి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక తోటపాలెం సత్య డిగ్రీ కళాశాలలో ఆ రోజు ఉదయం 10 గంటల నుంచి 12 గంటల వరకూ పోటీలు నిర్వహిస్తామని పేర్కొన్నారు. జూనియర్స్ విభాగంలో 5 నుంచి 9 ఏళ్లలోపు విద్యార్థులు, సీనియర్స్ విభాగంలో 10 నుంచి 15 ఏళ్ల లోపు విద్యార్థులు పాల్గొనవచ్చని స్పష్టం చేశారు. పెయింటింగ్ సామగ్రి ఎవరికి వారే తెచ్చుకోవాలని, గెలుపొందిన అభ్యర్థులకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులతో పాటూ పది కన్సొలేషన్ బహుమతులు, పాల్గొన్న ప్రతి ఒక్కరికీ మెరిట్ సర్టిఫికెట్ అందజేస్తామన్నారు. ఈ నెల 8న సాయంత్రం 6 గంటల్లోపు రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని సూచించారు. రిజిస్ట్రేషన్ కోసం ఫోన్ 8985693899, 9494421421, 8977770986 నంబర్లను సంప్రదించాలని కోరారు.

యువకులకు ఉపాధి శిక్షణ

విజయనగరం అర్బన్: నిరుద్యోగ యువకులకు ఉపాధి కలిగించేందేకు పలు కోర్సుల్లో ఉచిత శిక్షణ తరగతులను స్థానిక మహిళా ప్రాంగణంలోని స్టేట్‌బ్యాంక్ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ వసతిగృహంలో నిర్వహిస్తామని సంస్థ ప్రతినిధి జీబీవీ రమణ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. పురుషులకు హౌస్ వైరింగ్, టైలరింగ్, ఇన్‌స్టలేషన్ ఆఫ్ సీసీ టీవీ, కెమెరా కోర్సులపై శిక్షణ ఉంటుందని పేర్కొన్నారు. 30 రోజుల పాటు శిక్షణ ఉంటుందని, ఆ సమయంలో వసతి, భోజన సదుపాయం కల్పిస్తామని తెలిపారు. తెలుపు రంగు రేషన్‌కార్డు కలిగి 45 సంవత్సరాల్లోపున్న గ్రామీణ ప్రాంత పురుషులు దరఖాస్తు చేసుకోవాలన్నారు. వచ్చే నెల పదో తేదీలోగా దరఖాస్తులను కార్యాలయానికి పంపించాలని సూచించారు. పూర్తి వివరాలకు 99595 21662, 99857 87820 నంబర్లను సంప్రదించాలని కోరారు.

సంక్షేమ క్యాలెండర్ ఆవిష్కరణ

విజయనగరం: ప్రభుత్వం రూపొందించిన సంక్షేమ క్యాలెండర్‌ను డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి గురువారం తన నివాసంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, దేశంలో ఎక్కడా లేనివిధంగా ఏడాది పొడవునా ఏ నెలలో ఏ సంక్షేమ పథకాలు అందిస్తామో క్యాలెండర్ రూపొందించిన ఘనత ముఖ్యమంత్రి జగనన్నకే దక్కుతుందన్నారు. సంక్షోభాలెన్ని ఉన్నా చెప్పిన సమయానికి పథకాలు అందించడం జగన్ మోహన్ రెడ్డికి తప్ప మరెవ్వరికీ సాధ్యం కాదన్నారు. ఎన్నికల మేనిఫెస్టోలో పొందుపరిచిన హామీల్లో 98.44 శాతం నెరవేర్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా సమాచార పౌరసంబంధాల అధికారి డి.రమేష్, ఏపీ సూపర్‌వైజర్ సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

రైలు నుంచి జారిపడి హోంగార్డు మృతి


విజయనగరం క్రైమ్: హోంగార్డు గోవిందరావు మృతదేహం

విజయనగరం క్రైమ్: తెలంగాణ రాష్ట్ర రాజధాని హైదరాబాద్‌లో హోంగార్డుగా విధులు నిర్వహిస్తున్న శ్రీకాకుళం జిల్లా అన్నంపేట కాపువీధికి చెందిన మజ్జి గోవిందరావు (43) రైలునుంచి జారిపడి గురువారం మృతిచెందాడు. వివరాలిలా ఉన్నాయి. బంధువుల ఇంట్లో శుభకార్యానికి హాజరయ్యేందుకు హోం గార్డు గోవిందరావు హైదరాబాద్ నుంచి శ్రీకాకుళానికి రైలులో బయల్దేరాడు. విజయనగరంలోని మహిళా ప్రాంగణం వద్దకు వచ్చే సరికి మలుపు వద్ద ప్రమాదవశాత్తు రైలు నుంచి జారిపడి అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడికి భార్య పావని, ఇద్దరు పిల్లలున్నారు. ఈ ఘటనపై కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు రైల్వే ఎస్సై రవి వర్మ తెలిపారు.

బైక్ బోల్తా పడి యువకుడు..


జామి: సందీప్ మృతదేహం

జామి: బైక్ అదుపు తప్పడంతో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు మృతిచెందాడు. ఈ ప్రమాదం వివరాలిలా ఉన్నాయి. జామి గ్రామానికి చెందిన బోని సందీప్ (25) జామినుంచి విజయనగరం బైక్‌పై బుధవారం రాత్రి వెళ్తున్న సమయంలో భీమసింగి జంక్షన్ వద్ద వృద్ధుడు ఎర్రి ఈశ్వరరావు పాన్‌షాప్ నుంచి ఇంటికి వెళ్తున్నాడు. ఆ సమయంలో వృద్ధుడిని తప్పించబోయి బైక్ బోల్తా పడి సందీప్ మృతిచెందాడు. వృద్ధుడు ఈశ్వరరావుకు గాయాలయ్యాయి. మృతుడి భార్య దేవమ్మ విజయనగరంలో ఒక జ్యూయలర్ షాపులో పనిచేస్తోంది. ఈ దంపతులకు ఒక కుమారుడు ఉన్నాడు. ఈ ఘటనపై కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టినట్లు ఎస్సై వీరబాబు తెలిపారు.

చికిత్స పొందుతూ వ్యక్తి..


గజపతినగరం: మూడు రోజుల క్రితం గడ్డి మందు తాగి ఆత్మహత్యా యత్నం చేసిన మండలంలోని మరుపల్లి గ్రామానికి చెందిన పైల భాస్కరరావు(28) ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ విషయంపై ఎస్సై గంగరాజును సంప్రదించగా తమకు ఎటువంటి సమాచారం రాలేదని చెప్పారు.

కారు ఢీకొని మరొకరు..


బొబ్బిలి: ప్రమాద స్థలి వద్ద అపస్మారక స్థితిలో లక్ష్మణ రావు

బొబ్బిలి: పట్టణంలోని ఐటీఐ కాలనీ వద్ద కారు ఢీకొని మండలంలోని చింతాడకు చెందిన బిక్కోలు లక్ష్మణ రావు(55) గురువారం రాత్రి మృతి చెందాడు. రామభద్రపురం నుంచి ద్విచక్ర వాహనంపై బొబ్బిలి వస్తున్న లక్ష్మణరావును మద్యం మత్తులో కారు నడుపుతున్న పార్వతీపురం మన్యం జిల్లా సీతానగరం మండలం లచ్చయ్యపేటకు చెందిన బత్తుల సాయిరాం బలంగా ఢీకొట్టడంతో లక్ష్మణ రావు అపస్మారక స్థితిలోకి వెళ్లిపోయాడు. ట్రాఫిక్ పోలీసులు ప్రమాదాన్ని గుర్తించి క్షతగాత్రుడిని ఆటోలో బొబ్బిలి సీహెచ్‌సీకి తరలించగా అప్పటికే మృతి చెందినట్టు వైద్యులు ధ్రువీకరించారు. లక్ష్మణ రావు ఇటుకల తయారీ కేంద్రంలో భార్య లక్ష్మితో కలిసి పనిచేస్తున్నాడని ఇద్దరు పిల్లలున్నట్లు మృతుని బంధువులు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

శివాలయంలోకి ఏనుగులు


పక్కుడుభద్ర ఆలయంలోకి ప్రవేశిస్తున్న ఏనుగుల గుంపు

భామిని: మండలంలోని పక్కుడుభద్ర సమీపంలో జీర్ణోద్ధరణ జరుగుతున్న స్వయం భూ దేవాలయంలోకి గురువారం ఆరు ఏనుగుల గుంపు ప్రవేశించి ప్రత్యేకత చాటుకుంది. ఏనుగులు ప్రతి రోజూ ఆలయంలోకి ప్రవేశిస్తున్నాయని స్థానికులు చెబుతుంటారు. అయితే వాస్తవంగా స్వయం భూ దేవాలయంలోకి ఏనుగులు ప్రవేశించి గంట కొట్టాయని స్థానికులు స్పష్టం చేస్తున్నారు. బత్తిలికి చెందిన శాసనపురి కుటుంబసభ్యులతో జీర్ణోద్ధరణ జరుగుతున్న ఆలయంలోకి ఏనుగులు ప్రవేశించడంపై విశేష ప్రచారం కొనసాగుతోంది. ఇంతవరకు పంట నష్టాలపై చెప్పుకునే రైతులు, ఇప్పుడు ఏనుగుల ఆలయ ప్రవేశంపై ప్రచారం చేస్తున్నారు.

అర్ధరాత్రి ఆకతాయిల వీరంగం



వాహనాన్ని అడ్డుకుంటున్న ఆకతాయిలు

రాజాం సిటీ: స్థానిక అంబేడ్కర్ జంక్షన్ వద్ద బుధవారం అర్ధరాత్రి సమయంలో మద్యం సేవించిన ఆకతాయిలు వీరంగం వేశారు. సుమారు పది మంది వరకు గుంపుగా చేరి రోడ్డుపై వస్తున్న వాహనాలను అడ్డగించారు. దీంతో వాహనదారులతో పాటు ఇతరులు ఇబ్బందులకు గురయ్యారు. నడిరోడ్డుపై ఆకతాయిలు వికృతచేష్టలకు పాల్పడుతుండడంతో పట్టణవాసులు భయాందోళనకు గురవుతున్నారు. ఈ విషయంపై టౌన్ సీఐ రవికుమార్ వద్ద ప్రస్తావించగా ఆకతాయిలను సీసీ ఫుటేజీ ఆధారంగా గుర్తించామని, వారిని స్టేషన్‌కు తీసుకువచ్చి తల్లిదండ్రులకు అవగాహన కల్పించనున్నామన్నారు.

ముగ్గురికి షోకాజ్ నోటీసులు


జగతపల్లి వ్యూపాయింట్ చూస్తున్న పీవో కల్పనాకుమారి

సీతంపేట: మండలంలోని దేవనాపురం మండల పరిషత్ పాఠశాలలో నాడు నేడు పనులు త్వరగా పూర్తి కాకపోవడంతో ఇంజినీరింగ్ అసిస్టెంట్, వెల్ఫేర్ అండ్ ఎడ్యుకేషన్ అసిస్టెంట్, పాఠశాల ఉపాధ్యాయుడికి షోకాజ్ నోటీసులు ఇవ్వాలని ఐటీడీఏ పీఓ కల్పనాకుమారి సంబంధిత అధికారులను ఆదేశించారు. ఐటీడీఏ పీఓ కల్పనాకుమారి గురువారం పాఠశాలను సందర్శించారు. ఈ సందర్భంగా మనబడి నాడు-నేడు పనులపై సమీక్ష చేశారు. నాడు-నేడు పనులు సకాలంలో పూర్తి చేయాలని ఐటీడీఏ పీవో కల్పనాకుమారి ఆదేశించారు.

మహిళా పోలీస్‌కు..

గ్రామంలో అంగన్‌వాడీ కేంద్రం సక్రమంగా పని చేయకపోవడంతో ఎందుకు పర్యవేక్షించలేదని మహిళా పోలీస్‌కు షోకాజ్ ఇవ్వాలన్నారు. విచారణ చేయాలని సూపర్‌వైజర్‌ను ఆదేశించారు. అనంతరం జగతపల్లి వ్యూపాయింట్‌ను చూశారు. పనుల ప్రారంభం కోసం సంబంధిత అధికారులతో మాట్లాడారు. అలాగే ఐటీడీఏ ప్రాంగణంలో నడుస్తున్న వీడీవీకే కేంద్రాలను పరిశీలించారు.

మెట్టుగూడ గిరి జనులకు ఇళ్లు మంజూరు

ఇటీవల వర్షాలకు మెట్టుగూడలో పూర్తిగా పాడైపోయిన ఇళ్లను పీవో పరిశీలించారు. చిన్నబూదమ్మ, సవర చంద్రమ్మ ఇళ్లను చూసి వారికి కొత్త గృహాలు మంజూరు చేశారు. వారితో పాటు మరో 7గురు రేకు ఇళ్లలో ఉండడంతో వారికి కూడా కొత్త ఇళ్లు మంజూరయ్యేలా చూస్తామన్నారు. కార్యక్రమంలో గిరిజన సంక్షేమ ఇంజినీరింగ్ ఈఈ మురళి, డీఈ కృష్ణ కుమార్, ఏఈ శ్రీవిద్య, పీఏవో హరికృష్ణ, హౌసింగ్ ఏఈ వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

రిమాండ్‌కు గంజాయి నిందితుడు


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న సీఐ ఎల్.అప్పలనాయుడు

గజపతినగరం: మండలంలోని మరుపల్లి గ్రామ హైస్కూల్ సమీపంలో గంజాయితో పట్టుబడిన వ్యక్తిని రిమాండ్‌కు తరలించినట్లు గజపతినగరం సీఐ ఎల్.అప్పలనాయుడు తెలిపారు. ఈ మేరకు గురువారం ఆయన సర్కిల్ ఆఫీస్ సమీపంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మరుపల్లి గ్రామానికి చెందిన పీతల శివ చెడువ్యసనాలకు బానిసయ్యాడు. చిన్నతనంలోనే తల్లి చనిపోవడంతో తండ్రి రెండో వివాహం చేసుకున్నాడు, అప్పటినుంచి సంరక్షణ సక్రమంగా లేకపోవడంతో చెడువ్యసనాలకు లోనై ఏడాదిన్నర క్రితం రాజమండ్రిలో ప్రమాదానికి గురికావడంతో బాధలు తగ్గించు కునేందుకు గంజాయి బారిన పడ్డాడు. ఈ క్రమంలో నిత్యం రాయగడ వెళ్లి తాటిమంజులు విక్రయించడం, అక్కడి నుంచి గంజాయిని కొనుగోలు చేసి తెచ్చి మరుపల్లి, మానాపురం తదితర ప్రాంతాల్లో సరఫరా చేసేవాడు. సమాచారం మేరకు స్థానిక ఎస్సై గంగరాజు, రెవెన్యూ అధికారులు సంయుక్తంగా నిందితుడిని గంజాయితో స్వాధీనం చేసుకున్నారు. సమావేశంలో ఎస్సై గంగరాజు పాల్గొన్నారు.

అన్నమయ్య జయంతి వేడుకలకు సర్వం సిద్ధం


ఆహ్వాన పత్రికలను ఆవిష్కరిస్తున్న కళాపీఠం వ్యవస్థాపకుడు ఎమ్.భీష్మారావు, తదితరులు

● భక్తుల సందర్శనార్థం 12 అడుగుల వేంకటేశ్వరస్వామి విగ్రహం ఏర్పాటు

విజయనగరం టౌన్:

శ్రీవారి స్వచ్ఛంద సేవా సంస్థ, ఘంటసాల స్మారక కళాపీఠం సంయుక్త ఆధ్వర్యంలో ఈ నెల 6వ తేదీ సాయంత్రం ఆరు గంటల నుంచి అన్నమయ్య జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు సర్వం సిద్ధం చేసినట్లు కళాపీఠం వ్యవస్థాపకుడు ఎమ్.భీష్మారావు తెలిపారు. ఈ మేరకు కళాపీఠం ఆవరణలో కార్యక్రమానికి సంబంధించిన ఆహ్వానపత్రికలను గురువారం ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, స్థానిక గురజాడ కళాభారతి ఆడిటోరియం ఆవరణలో ఆ రోజు సాయంత్రం నిర్వహించే కార్యక్రమానికి డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి ముఖ్య అతిథిగా హాజరుకానున్నారన్నారు. భక్తుల సందర్శనార్థం అక్షయ కన్‌స్ట్రక్షన్స్ అధినేత ఏగిరెడ్డి తిరుపతినాయుడు ఆధ్వర్యంలో 12 అడుగుల వేంకటేశ్వరస్వామి విగ్రహం ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు.

అన్నమాచార్యుల సంకీర్తనామృతంతో ప్రారంభం కానున్న కార్యక్రమంలో భగవతి నృత్యకళామందిర్ రమణకుమారి బృందంతో 'అన్నమయ్య జననం' నృత్యరూపకాల ప్రదర్శన ఉంటుందని చెప్పారు. సంస్థ అధ్యక్షుడు గ్రంధి విష్ణుమూర్తి, గౌరవాధ్యక్షుడు ధవళ సర్వేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి బి.ఉమాశంకర్, సహాయ కార్యదర్శి బి.సూర్యనారాయణ, కోశాధికారి వైవీపీ సత్యనారాయణ (అబ్బులు), సభ్యులు మమత, స్వర్ణ, ప్రసాదరావు, సుధ, త్రిషిత, తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా రామాలయం ప్రారంభోత్సవం

బాడంగి: మండలంలోని రేజేరులో నూతనంగా నిర్మించిన రామాలయ మందిర ప్రారంభోత్సవం గురువారం నుంచి మూడు రోజుల పాటు నిర్వహిస్తామని గ్రామపెద్దలు తెలిపారు. మొదటి రోజు పందిర్రాట వేసి ప్రత్యేక అంకురార్పణ పూజలు చేశారు. కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

కోడిగుడ్ల ధరలు

హోల్‌సేల్ ధరలు	(100 గుడ్లు)
విశాఖపట్నం	రూ. 450.00
విజయనగరం	రూ. 454.00
శ్రీకాకుళం	రూ. 454.00

బులియన్

విశాఖపట్నం	
బంగారం(24సి. 10గ్రా.)	62,180-00
బంగారం(22సి. 10గ్రా.)	57,000-00
వెండి (కిలో)	82,800-00

చికెన్

బ్రాయిలర్

లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
₹147	₹264	₹ 274